ఉపాధి హామీ పనులపై ప్రణాళిక ఖరారు !

- 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనిదినాల గుర్తింపు
- మొక్కలు నాటడం, చెరువుల పూడికతీత
- ఫీడర్‌ కాలువలు, కందకాలకు ప్రాధాన్యం



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు (డీఆర్డీఏ)కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేశాయి. ఏప్రిల్‌ నుంచి 2026 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులను కూడా గుర్తించారు.

- శివారు మేడ్చల్‌, రంగారెడ్డిజిల్లాల్లో 1,78,867 మంది కూలీలకు 11.83 లక్షల పనిదినాల్లో రూ. 27.95 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు (మేటీరియల్‌ కాంపొండ్‌తో కలిపి)చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించేందుకు కసరత్తు చేస్తున్నారు.
- మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 17,832 మంది కూలీలకు 1.71 లక్షల పనిదినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనుల (మేటీరియల్‌ కాంపొండ్‌తో కలిపి)నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. కూలీలకు 100 రోజులు పనిని కల్పించడం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.
- నగర శివారు జిల్లాల్లో మొత్తంగా 620 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇటీవల ప్రభుత్వం 40 గ్రామ పంచాయతీలను సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 580 గ్రామపంచాయతీల్లోనే ఉపాధి హామీ పనులు జరిగేలా ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేస్తున్నాయి.

పనులు ఇలా..

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు మేడ్చల్‌ జిల్లాలో 2,369 మంది కూలీలకు 37,631 పనిదినాలను కల్పించడం ద్వారా సామగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనుల (మేటీరియల్‌ కాంపొండ్‌తో కలిపి) విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతిరోజు 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో నిమగ్నమై పనిచేస్తున్నారు.

రూ.22.64 కోట్ల మేర పనులు..

రంగారెడ్డి జిల్లాలో కూడా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు రూ.10.12 లక్షల పనిదినాలను కల్పించిన డీఆర్‌డీఏ రూ.22.64 కోట్ల అభివృద్ధి పనులు (మేటీరియల్‌ కాంపొండ్‌తో కలిపి)చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వడం, ఫీడల్‌ కాలువల నిర్మాణం, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం వంటి పనులను కూలీలు చేపట్టారు.

ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులివే..

నగర శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఉపాధి పనుల్లో భాగంగా ఊట కుంటలు, కందకాలు తవ్వడం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచడం, పల్లె పకృతి వనాలు, రైతు కళ్లాలు, ఇంకుడు గుంతలు, ప్రభుత్వ స్థలంలో నేల చదును, ఎండిపోయిన బోరుబావుల రీచార్జి, వైకుంఠ దామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయడం, డంపింగ్‌ యార్డులు, కామన్‌ ల్యాండ్‌ సోక్‌ ఫిట్స్‌, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్‌ , కంపోస్ట్‌ ఎరువుల గుంతలు, ఫీడర్‌ కాలువలు వంటి పనులను కూలీలు చేపట్టనున్నారు.

- పశువులు, గొర్రెలు, మేకల తోట్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, తాటివనాలు, చేపల కుంటలు, మిషన్‌ భగీరథ కోసం కందకాలు, మైనర్‌ ఇరిగేషన్‌ కాలువల్లో పూడికతీత, వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం వంటి ఉపాధిపనులు కూడా కూలీలు చేపట్టనున్నారు.

స్పటిక లింగేశ్వర ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: సర్వ మంగళాసమేత స్పటిక లింగేశ్వరస్వామి ఆలయ సప్తదశ (17వ) వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం బద్దం జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ చైర్మన్‌ కొండల్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు చెరుకు సరిత, బద్రి నారాయణగౌడ్‌, మాజీ కౌన్సిలర్‌ మెట్టు బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకుడు మందడి సురేందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతరకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

ఘట్‌కేసర్‌: జాతరకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు చెందిన మంచాల విష్ణు, భార్య నవ్య, పిల్లలతో కలిసి బీబీనగర్‌ దేవాలయం జాతరకు ఆదివారం రాత్రి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో బంగారు చెవి కమ్మలు, 2 గ్రాముల చెవి దుద్దులు, రూ. 5 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

గుత్తుల కమల అనే మహిళ భర్త అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పక్కింట్లో చోరీ చేసిన దుండగులు ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని చెవి కమ్మలు, ఉంగరం, వెండి పూజా సామగ్రితో పాటు రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తుండగా చెలరేగిన మంటలు

శామీర్‌పేట్‌: వంటగ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తుండగా మంటలు చెలరేగడంతో ఇళ్లు ధ్వంసమైన ఘటన సోమవారం సాయంత్రం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తూంకుంట మున్సిపాలిటీ, పోతాయిపల్లిలో తీగుళ్ల గోపాల్‌ ఇంట్లో అద్దెకు నివాసం ఉంటూ సమీపంలోని ఉన్న గ్యాస్‌ సిలిండర్‌ గోదామ్‌లో పనిచేస్తున్నారు. కాగా ఆదివారం సాయంత్రం వారు నివాసం ఉంటున్న ఇంట్లో డొమెస్టిక్‌ సిలిండర్ల నుంచి అక్రమంగా రీఫిల్లింగ్‌ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీ శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నట్లు సమచారం.

ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌



ఏఐ సాంకేతికత గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్‌: పట్టణంలోని రైల్వేస్టేషన్‌ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ ప్రారంభమైంది. సోమవారం ఎంఈవో రంగచారి ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం ఆర్టిఫియల్‌ ఇంటలిజెన్స్‌ అభివృద్ధికి పైలెట్‌ ప్రాజెక్ట్‌ కింద మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. ల్యాబ్‌ ద్వారా ఆర్టిఫియల్‌ ఇంటలిజెన్స్‌తో చదవడం, రాయడం, పిల్లలకు నేర్పిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. హెచ్‌ఎం రాజిరెడ్డి, మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



స్వామివారి కల్యాణోత్సవంలో బీజేపీ, కాంగ్రెస్‌ నేతలు

ఘట్‌కేసర్‌: అంకుషాపూర్‌లో భ్రమరాంబికామల్లికార్జున స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. సోమవారం యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు బోనాలను అలంకరించి మల్లికార్జున స్వామి, రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. బోనాలను నైవేద్యంగా సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారులు, శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాజుముదిరాజ్‌, పి.రాజు, జైపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, యాదవ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్‌: మండలంలోని రావల్‌కోల్‌ గ్రామంలో మల్లికార్జునస్వామి కల్యాణమహోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం స్వామివారి కల్యాణం, పట్నాలు, అగ్నిగుండాలు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్‌, యువమోర్చా నాయకులు అర్జున్‌, మహేష్‌, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌యాదవ్‌, కాంగ్రెస్‌నేతలు బాలేష్‌యాదవ్‌, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ లక్ష్మీనర్సింహకాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు మేడ్చల్‌, మల్కాజిగిరిజిల్లా ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వి రెండు నెలలైనా కాలనీలో నడవలేక, వాహనాలు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోడ్డు పనులను కొందరు వ్యక్తులు అడ్డుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కేకే.చారి, శ్రీకాంత్‌, లక్ష్మీనారాయణ, రవి, నరేష్‌, మహేందర్‌, రాజు, వెంకన్న, వెన్నెల, మౌనిక, స్వప్న, సాయిలు, అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

సాక్షి,సిటీబ్యూరో: జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్‌ అధ్వర్యంలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. జర్నలిస్టులకు కొత్త ఆరోగ్యబీమా పథకాన్ని ప్రవేశపెటాలని, హెల్త్‌ కార్డు ప్రైవేటు, కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని వారు కోరారు. కొత్త అక్రిడిటేషన్‌ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులు ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్‌ పథకాన్ని అమలు చేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టడంతో పాటు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్‌ చేశారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రిపూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం టీడబ్ల్యూజేఎఫ్‌ ప్రతినిధుల బృందం మేడ్చల్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టీడబ్ల్యూజేఎఫ్‌ రాష్ట్ర, జిల్లా నేతలు తన్నీరు శ్రీనివాసరావు, గుమ్మడి హరిప్రసాద్‌, అశోక్‌, రోజారాణి, పటేల్‌ నర్సింహులుయాదవ్‌, అశోక్‌, మల్లేష్‌గౌడ్‌, కృష్ణ, రామచంద్రమూర్తి, మల్లేష్‌ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఆకట్టుకున్న ‘టెక్నిక్స్‌–2కే25’ సాంకేతికోత్సవం

ఘట్‌కేసర్‌: విద్యార్థుల నైపుణ్యానికి ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య అన్నారు. సోమవారం ఘట్‌కేసర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్‌ కళాశాలలో ‘‘టెక్నిక్స్‌ –2కే25’’ సాంకేతికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతికోత్సవం పాలిటెక్నిక్‌ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలపై అవగాహన కల్పించే గొప్ప అవకాశమని, టెక్నికల్‌ ఫెస్టివల్స్‌ కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని చెప్పారు. ఈ ఫెస్ట్‌లో 32 ఈవెంట్లు, 60 ప్రాజెక్టులు ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్‌ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్‌ ప్రిన్సిపాల్‌ జానకీరాములు, ఫార్మసీ ప్రిన్సిపాల్‌ శ్రవణ్‌కుమార్‌, పాలిటెక్నిక్‌ ప్రిన్సిపాల్‌ శివకేశవరెడ్డి, ప్రొఫెసర్‌ మోహన్‌లు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనతో విద్యార్థినులు

యువత ప్రైవేటు రంగాల్లో ఉపాధిని ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతారెడ్డి

శామీర్‌పేట్‌: ప్రైవేట్‌ సంస్థలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మూడుచింతలపల్లి ఎంపీడీఓ గీతారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఈజీఎంఎం ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని, యువత సద్వినియోగం చేసుకుని స్థిరపడాలని సూచించారు. మండల వ్యాప్తంగా 146 మంది హాజరు కాగా.. 89 మంది వివిధ కంపెనీలకు సంబంధించిన ఉద్యోగ అవకాశాలకు ఆసక్తి కనబరిచారని నిర్వాహకులు తెలిపారు. ఎంపీఓ మంగతాయారు, ఏపీఎం శేఖర్‌, సీసీలు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై ఫిర్యాదు !

ఘట్‌కేసర్‌: ఘనాపూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అనుమతులు లేని నిర్మాణాలపై మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించడం లేదని స్థానికుడు బొక్క కష్టారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. సర్వేనెంబర్‌ 1140, 1141లోని 2000 గజాల్లో అనుమతి లేకుండా పిల్లర్ల స్థాయిలో పనులు జరుగుతుండగా ఫిర్యాదు చేశామని, సగం మేర పనులు పూర్తయిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నిర్మాణాలపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

కీసర బ్రహ్మోత్సవాల్లో క్రీడా పోటీలు !

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనారెడ్డి అన్నారు. సోమవారం కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే జిల్లా స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కీసరగుట్ట దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని దేవాలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సుమారు రూ.కోటి వరకు నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు స్నేహపూరితమైన వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో భక్తులు, క్రీడాకారులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అనంతరం శివసేనారెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శివసేనారెడ్డి

ప్రజా దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచకూడదని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 64 ఫిర్యాదులతో కూడిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన పురోగతిని ఆన్‌లైన్‌ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్‌ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్‌ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

కీసర: మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని రాచకొండ కమిషనర్‌ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం సాయంత్రం కీసరగుట్టలో సివిల్‌, ట్రాఫిక్‌, ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్‌ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతాపరమైన పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలు ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని, జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాల ద్వారా కమాండ్‌ కంట్రోల్‌ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీమ్‌ బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ, డీసీపీ క్రైం అరవింద్‌బాబు, ఐటీసెల్‌ ఏసీపీ నరేందర్‌గౌడ్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర

- వైభవంగా ప్రారంభమైన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు
- తొలిపూజలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్‌ నారాయణ



శంభో శంకర హరహర మహాదేవ అంటూ భక్తజనుల జయజయధ్వానాల మధ్య కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ వేదపాఠశాల అవధాని ఆచార్య పుల్లేటీకుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ దంపతులు, ఈవో సుధాకర్‌రెడ్డితో కలిసి మహామండపంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, తదితర వైదిక కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. యాగశాల ప్రవేశం చేసి వేదపండితులు జ్యోతి ప్రతిష్టాపన చేశారు. బేరీపూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు.

– కీసర



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్‌ నారాయణ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- మొదటిరోజు పూజా కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ కార్పొరేషన్‌ చైర్మన్‌ శివసేనరెడ్డి, మాజీ జెడ్పీవైస్‌ చైర్మన్‌ బెస్త వెంకటేష్‌, ట్రస్టుబోర్డు సభ్యులు, ఫౌండర్‌ ఫ్యామిలీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- సాయంత్రం పల్లకీసేవ ద్వారా కీసరగుట్ట స్వామివారు కీసర గ్రామానికి బయలుదేరారు. తిరిగి మంగళవారం సాయంత్రం కీసరగుట్టకు పల్లకీ సేవ ద్వారా స్వామివారు కీసరగుట్టకు చేరుకోవడం, అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.

నేటి పూజా కార్యక్రమాలు..

రెండో రోజు ఉదయం ఆలయంలో రుద్రస్వాహాకార హోమం, వేదపారాయణం, సాయంత్రం బిల్వార్చన, రాత్రి ప్రదోషకాల పూజ, హారతి, మంత్రపుష్పం, పరాకస్తవం, తీర్థప్రసాద వినియోగం, కీసర గ్రామం నుంచి కీసరగుట్టకు స్వామివారికి ఆహ్వానం, రాత్రి 10 గంటలకు శ్రవణనక్షత్రయుక్త తుల లగ్నమందు భవానీశివదుర్గా సమేత రామలింగేశ్వరస్వామివార్ల కల్యాణమహోత్సవం ఉంటుంది.

పోచమ్మ అంగడి..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు కీసరలో పోచమ్మ అంగడి జరుగనుంది. శివరాత్రి తొలిపూజకు హాజరయ్యే అమ్ముగూడ, యాప్రాల్‌ తదితర ప్రాంతాలకు చెందిన తమిళులు, కీసరలో జరిగే పోచమ్మ అంగడిలో పాల్గొని సాయంత్రం కీసరగుట్టకు చేరుకుని శివరాత్రి ఉపవాసదీక్షను చేపడతారు.

జాతరకు ఆర్టీసీ స్పెషల్‌ క్యాంప్‌..

కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి జాతర సందర్భంగా గ్రేటర్‌ ఆర్టీసీ హైదరాబాద్‌ జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ రాజశేఖర్‌ కీసరగుట్ట బస్టాండ్‌ వద్ద జాతర స్పెషల్‌ క్యాంప్‌ను ప్రారంభించారు. డిప్యూటీ ఆర్‌ఎం శ్రీనివాస్‌, జీహెచ్‌జీ భీమ్‌రెడ్డి, కుషాయిగూడ డిపో మేనేజర్‌ మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

- రెడ్డి సంక్షేమ సంఘం– కీసరగుట్ట రెడ్డి భవనం, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, వంశరాజ్‌ సంక్షేమ సంఘం, మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదవితరణ చేపట్టారు.
- జిల్లాస్థాయి క్రీడోత్సవాలు ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత కుడా ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సివచ్చింది.



కీసరగుట్ట రెడ్డి భవనంలో అన్నప్రసాద వితరణలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు..

మేడ్చల్‌: శివరాత్రి పండగ సందర్భంగా కీసరగుట్టకు వెళ్లే భక్తులకు మేడ్చల్‌ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తోందని మేడ్చల్‌ డిపో మేనేజర్‌ సుధాకర్‌ తెలిపారు. ఈనెల 26,27వ తేదీల్లో మేడ్చల్‌, సుచిత్ర, ఈసీఐఎల్‌ ప్రాంతాల నుంచి కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఉదయం 8 గంటల నుంచి ప్రతి 2 గంటలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని డీఎం ప్రకటించారు.